క్లుప్తంగా

బీజేపీతో సుస్థిర పాలన



మాట్లాడుతున్న షణ్ముగం

చిత్తూరు కార్పొరేషన్: బీజేపీ నాయకత్వంలో దేశంలో సుస్థిరపాలన అందుతోందని ఆ పార్టీ చిత్తూరు సెంట్రల్ అధ్యక్షుడు షణ్ముగం తెలిపారు. ప్రధాని 11 ఏళ్ల సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లేలా ఆదివారం చిత్తూరులోని పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యశాలలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోదీ పరిపాలన కాలంలో దేశం ప్రగతి పథంలో పయనిస్తోందన్నారు. 11 ఏళ్ల పాలనపై జూలై 9 వరకు వివిధ కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మహా కుంభాభిషేకం

గంగాధరనెల్లూరు: మండలంలోని వేల్కూరు గ్రామంలో వెలసిన తిరుమలేశ్వరి సమేత శ్రీతిరుమలేశ్వర ఆలయ మహా కుంభాభిషేక మహోత్సవం, ధ్వజస్తంభ ప్రతిష్టాపన కార్యక్రమం సోమవారం ఉదయం 9–10 గంటల సమయంలో ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు అన్నదాన కార్యక్రమాలు ఊరేగింపు ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

అలరించిన దుర్యోధన వధ




భీమ, దుర్యోధనుల యుద్ధ సన్నివేశం

శ్రీరంగరాజపురం: మండలం కేంద్రంలోని భారతంమిట్ట వద్ద వెలసినశ్రీ ద్రౌపది ధర్మరాజులు ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక మహాభారతం ఉత్సవం బ్రహ్మోత్సవంలో భాగంగా ఆదివారం దుర్యోధన ఘట్టం అట్టహాసంగా జరిగింది. ఉదయం ఆలయ అర్చకులు అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేపట్టి, భక్తులకు సర్వదర్శనం కల్పించారు. మధ్యాహ్నం హరికథ, ప్రత్యేకంగా భక్తులను ఆకట్టుకుంది. అనంతరం దుర్యోధన ఘట్టం ప్రదర్శించారు. దుర్యోధనుడిని భీమసేనుడు గంగమడుగు నుంచి బయటికి రప్పించే ఘట్టం చూపులను ఆకట్టుకుంది. దుర్యోధన పాత్ర పలువురిని కంటతడి పెట్టించాయి. భీముడు, దుర్యోధనుల యుద్ధ సన్నివేశం గతంలో జరిగిన ప్రజల కళ్లకు కట్టినట్లు చూపించారు. అనంతరం, ధర్మరాజుకు పట్టాభిషేకం చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహించారు.

పీ–ఫోర్.. ప్రజలు పరార్

- ప్రజలను పరేషాన్ చేస్తున్న పీ–4 సర్వే
- వ్యక్తిగత సమాచారం సైతం యాప్‌లో నమోదు
- సర్వేతో ప్రజలను వెంటాడుతున్న భయం



తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ప్రతి సారీ సర్వేలు చేయించడం, సంక్షేమ పథకాలకు కోత పెట్టడం పరిపాటిగా మారింది. ఈ సారి పీ–4 పేరుతోసర్వేలు చేయిస్తోంది. రాబోయే రోజుల్లో పింఛన్ల నుంచి రుణాల వరకూ అన్నీ కోతలు పెట్టేందుకు ఇప్పటినుంచే పకడ్బందీగా కార్యాచరణ మొదలుపెట్టింది. సచివాలయ సిబ్బందిని ఇంటింటికీ పంపి వివరాలు సేకరించే పనిలో ఉంది. అయితే ప్రజలు వీరికి సహకరించకపోవడంతో ఇష్టానుసారంగా వివరాలు నమోదు చేసేస్తున్నారన్న చర్చ మొదలైంది. దీంతో ఈ తప్పుడు వివరాలు తీసుకుని ప్రభుత్వం ఏం చేస్తుందో ఏమోనన్న ఆందోళనతో ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.



దుకాణంలో పీ-4 సర్వే చేస్తున్న సిబ్బంది (ఫైల్)

ఐరాల: మండల కేంద్రంతోపాటు గ్రామీణ ప్రాంతాల్లో ఇటీవల ప్రభుత్వ అధికారులు, సిబ్బంది సర్వే చేపట్టారు. ఇంటింటికీ వెళ్లి కుటుంబ సమాచారం సేకరిస్తున్నారు. ఇప్పటికీ మండల వ్యాప్తంగా 90 శాతం పీ–4 సర్వే పూర్తయినట్లు సమాచారం. ఇంతకీ సర్వే ఎలా సాగిందని క్షేత్ర స్థాయిలో విచారిస్తే ఎన్నో కొత్త విషయాలు వెలుగుచూశాయి.

హాలో.. ఏమండీ..మీకు ఎంతమంది పిల్లలు.. ఏమి చదువుకున్నారు.. మీ పిల్లలు ఇక్కడ ఉన్నారా.. లేక విదేశాల్లో ఉన్నారా.. మీ ఇంట్లో టీవీ ఉందా.. ఏసీ ఉందా.. ఫ్రిజ్ ఉందా.. కారు ఉందా.. స్కూటర్ ఉందా.. మీరు ప్రైవేటు ఉద్యోగమా.. లేక ప్రభుత్వ ఉద్యోగమా.. మీకు నెలకు ఎంత జీతం వస్తుంది.. మీరు ఇన్‌కంటాక్స్ చెల్లిస్తున్నారా.. ఇలా ఊపిరాడకుండా ప్రశ్నలతో పీ–4 సర్వే పేరిట సిబ్బంది ఉక్కిరిబిక్కిరి చేస్తున్నారు. నిరక్షరాస్యులైన గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు ప్రభుత్వం ఏ పథకాలు తీసేస్తుందనే ఆలోచనతో భయాందోళన చెందుతున్నారు. దీంతో సర్వే చేయడానికి వచ్చిన సిబ్బందికి సరైన సమాచారం ఇవ్వకుండా అరకొర వివరాలు చెప్పేసి అక్కడి నుంచి వెళ్లిపోతున్నారు. టార్గెట్ పూర్తి చేయలేక సర్వే సిబ్బంది మిగతా వివరాలను ఊహించి నమోదు చేస్తున్నారు.

ప్రజల్లో గుబులు

ఎన్నికల సమయంలో ఊకదంపుడు హామీలతో ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కూటమి పార్టీలు తీరా గద్దె నెక్కిన తరువాత ఏదో మొక్కుబడి ఒకటీ అరా ఇచ్చి చేతులు దులిపేసుకుంది. హామీలు అమలు చేయకపోగా సర్వేల పేరుతో ఉక్కిరిబిక్కిరి చేస్తుండడం ప్రజల్ని మరింత గుబులుకు గురి చేస్తోంది. పీ–4 సర్వే ప్రభుత్వ పథకాలు అమలు కోసమా.. లేక ప్రభుత్వ పథకాలు కోత వేసేందుకా? అని తెలియక ప్రజలు గందరగోళానికి గురవుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే బతుకులు బాగుపడుతాయని నమ్మబలికి తీరా అధికారంలోకి వచ్చిన తరువాత అడుగడుగునా మోసం చేస్తున్నారనే భావన ప్రజలకు కలుగుతోంది. కూటమి నేతలు సన్నాయి నొక్కులతో ప్రజలకు ప్రభుత్వంపై విరక్తి కలుగుతుంది.

లబ్ధిదారుల గుండెల్లో దడ

పీ–4 సర్వే భాగంగా సిబ్బంది 27 రకాల వివరాలను ప్రభుత్వం ఇచ్చిన యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఫోన్‌కి ఓటీపీని కూడా పంపిస్తున్నారు. కాయకష్టం చేసుకుని జీవించే పేదలకు కాసేపు వినోదం కోసం అప్పులు చేసి టీవీ, సెల్‌ఫోన్లు కొనుగోలు చేస్తుంటారు. కుటుంబ అవసరాల కోసం బైక్‌ను కూడా కొంతమంది వినియోగిస్తున్నారు. ఇలా వివరాలన్నీ నమోదు చేయడంతో పీ–4 సర్వే సామాన్యులతో పాటు సంక్షేమ పథకాల లబ్ధిదారుల గుండెల్లో దడ పుట్టిస్తోంది.

అనుమానాలు నివృత్తి చేయాలి



పీ-4 సర్వేపై ప్రజలకు అనుమానాలు ఉన్నాయి. వ్యక్తిగత సమాచారం కూడా సేకరిస్తున్నారు. ప్రభుత్వం కూడా ప్రజలకు అవగాహన కల్పించాలి. సర్వేపై ప్రజల్లో ఉన్న అనుమానాలు నివృత్తి చేయాలి. ఈ సర్వేను అడ్డుపెట్టుకుని సంక్షేమ పథకాల్లో కోత విధించడం భావ్యం కాదు.

–మురళి, సీపీఐ జిల్లా కార్యదర్శి, ఐరాల

భయం ప్రజలను వెంటాడుతోంది



సూపర్ సిక్స్ హామీల అమలు పక్కన పెట్టి పీ–4 సర్వే చేయడంపై అనుమానాలు వస్తున్నాయి. ఏదో ఒక సాకు చూపి పథకాలు అందకుండా చేస్తుందనే భయం ప్రజలను వెంటాడుతోంది. కూటమి ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీల నేతలపై అక్రమ కేసులు పెట్టేందుకు ప్రయత్నిస్తోంది.

–మోహన్, ఎంపీపీ, ఐరాల

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

ఐరాల: స్థానిక తహసీల్దార్ కార్యలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ లోకేశ్వరి తెలిపారు. కార్యలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. మండల ప్రజలు తమ సమస్యలు అర్జీల రూపంలో అందజేసి సమస్యలు పరిష్కరించుకోవాలని ఆమె కోరారు. మండల స్థాయి అధికారులు హాజరు కావాలని సూచించారు.

తవణంపల్లెలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక

తవణంపల్లె: మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీఓ హరి ప్రసాద్ రెడ్డి తెలిపారు. సమస్యలను తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామని వివరించారు. మండలంలోని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైద్య శిబిరంలో 100 మందికి సేవలు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నగరం మిట్టూరులోని ఓ ప్రైవేటు స్కూల్లో ఆదివారం కమ్మవారి అభ్యుదయ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్నిఎమ్మెల్యే గురజాల జగన్‌మోహన్ ప్రారంభించారు. మధ్యాహ్నం 11 నుంచి 2గంటల వరకు శిబిరంలో వైద్య పరీక్షలు చేసి మందులు, మాత్రలు పంపిణీ చేశారు. దీర్ఘకాలిక వ్యాధులకు సంబంధించి 100 మందికిపైగా ఈ శిబిరంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో చుడా చైర్మన్ కఠారి హేమలత, కమ్మవారి అభ్యుదయ సేవా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలి



ప్రతిభ చాటిన విద్యార్థులను అభినందిస్తున్న నిర్వాహకులు

చిత్తూరు కలెక్టరేట్: ఇంటర్మీడియట్, ఈఏపీ సెట్ ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకు సాగాలని పీఎస్ఎన్ శ్రీ వివేకానంద కళాశాల కరస్పాండెంట్ సత్యనారాయణ అన్నారు. ఈ మేరకు ఆదివారం మురుగానపల్లిలో ఉన్న ఆ కళాశాలలో ఇటీవల ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పేద, మధ్యతరగతి విద్యార్థులకు ఇంటర్మీడియట్ కళాశాల విద్యలో ఉత్తమ బోధన అందిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏటా తమ కళాశాలలో చదివే విద్యార్థులు ఇంటర్మీడియట్, జేఈఈ, ఏపీఈఏపీ సెట్ ఫలితాల్లో ప్రతిభ చాటి ర్యాంకులు సాధిస్తున్నారన్నారు. గత విద్యాసంవత్సరం తమ కళాశాల మొదటి సంవత్సరం ఎంపీసీ విద్యార్థులు ప్రజ్వల, నక్షత్ర 470కి 468 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించారన్నారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన పలువురు విద్యార్థులకు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆ కళాశాల ప్రిన్సిపల్ నాగరాజశెట్టి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలోని 104 ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర తెలిపారు. యూనియన్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న ఈఎల్, ఇతర బకాయిలు చెల్లింపునకు ప్రభుత్వం చొరవ తీసుకోవాలన్నారు. ప్రస్తుతం 104 నిర్వహణ ఏజెన్సీ మారిందని వారు కూడా ప్రతి నెలా జీతాలు ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలో ఖాళీగా ఉన్న స్థానాల్లో సీనియారిటీ ప్రకారం బదిలీలు చేసి మిగతా స్థానాల్లో కొత్త నియామకాలు జరపాలన్నారు. మరమ్మతు అయిన వాహనాలను వెంటనే బాగు చేయించాలన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రతి నెలా గ్రీవెన్స్ కార్యక్రమం ఏజెన్సీలు నిర్వహించే విధంగా చూడాలన్నారు.

అనుమానాస్పద వ్యక్తులతో జాగ్రత్త





సీజేఎస్ఎఫ్ కాలనీలో కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్న పోలీసులు, గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు

బంగారుపాళెం: గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తుల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సీఐ శ్రీనివాసులు అన్నారు. మండలంలోని వెలుతురు చేను, సీజేఎస్ఎఫ్ కాలనీ, పులిమగుడు గ్రామాల్లో ఆదివారం ఉదయం కార్డన్ సెర్చ్ కార్యక్రమాన్ని సిబ్బందితో కలసి చేపట్టినట్లు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రజలకు పోలీసులు దగ్గరవ్వాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల రక్షణ, భద్రత కల్పించడం కోసం పోలీస్‌శాఖ కృషి చేస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లో చట్ట వ్యతిరేకులు, చట్టాలను అతిక్రమించి డ్రగ్స్, గంజాయి, సారా విక్రయాలు వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వ్యక్తులు, దొంగలు ప్రజల మధ్య తిరుగుతున్నారా అని ప్రజలకు తెలియజేయడం కోసమే ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. అనంతరం గ్రామసభ ఏర్పాటు చేసి అపరిచితులు, అనుమానితుల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ ప్రసాద్, ఏఎస్ఐలు రామచంద్రారెడ్డి, మల్లప్ప, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జూన్ అంటేనే హడల్



జూన్ మాసం అంటేనే ప్రత్యేకత ఉంది. ఈ మాసంలోనే పాఠశాలలు పునఃప్రారంభం కావడం, రైతులకు వ్యవసాయ పనులు. అందుకే ఈ జూన్ మాసం అంటే అన్ని వర్గాల ప్రజలకు హడల్. పిల్లల చదువుల కోసం కొత్త బ్యాగులు, కొత్త పుస్తకాలు, కొత్త యూనిఫాం, కొత్త షూస్ వంటి వస్తువులు అవసరమవుతాయి. పిల్లలు ఓ వైపు, విద్యాసంస్థల నుంచి మరోవైపు ఒత్తిడి పెరుగుతుంటుంది. దీంతో తల్లిదండ్రుల గుండెలు బరువెక్కుతాయి. ఆకాశం వైపు, పొలం వైపు చూస్తూ ఈ ఏడాది పంటలు వేయాలి, సాగుకు పెట్టుబడి సాయం కోసం సమకూర్చుకోవాలన్న ఆలోచన మదిలోకి రాగానే అన్నదాతలకు కన్నీళ్లు తిరుగుతున్నాయి.

- అన్ని వర్గాల ప్రజలకు ఆర్థిక కష్టాలు
- తల్లిదండ్రులకు ఫీజుల బరువు
- సాగుకు పెట్టుబడి కోసం రైతుల్లో ఆందోళన

బంగారుపాళెం: ఏటా జూన్ వచ్చిందంటే చాలు పిల్లల తల్లిదండ్రులు, రైతులు కంటికి కనిపించని శత్రువులతో మానసిక యుద్ధం చేయాల్సిందే. మండలంలోని పలు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు సక్రమంగా లేకపోవడంతో ప్రైవేట్ పాఠశాలల వైపు మొగ్గు చూపుతున్నారు. తల్లిదండ్రులు తిన్నా తినకపోయినా వారి పిల్లలను బాగా చదివిద్దాం. అనే ఆలోచనలోనే వారు ఇబ్బందులు పడుతున్నారు. జూన్ మాసం వచ్చిందంటే మధ్యతరగతి కుటుంబాలు, రైతుల్లో ఆందోళన నెలకొంటోంది. పాఠశాలలు, కళాశాలలు ప్రారంభంతో విద్యార్థుల తల్లిదండ్రులపై ఫీజుల భారం, రైతులకు పంటల సాగులో పెట్టుబడి భారం తప్పడం లేదు. పిల్లలకు ఫీజులు, వసతి ఖర్చులు తలచుకుని తల్లిదండ్రులు జూన్ మాసం వచ్చేసిందంటే ఆందోళన పరిపాటిగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో ఇప్పటికే ప్రైవేట్ పాఠశాలల సిబ్బంది ఇంటింటికీ వెళ్లి పిల్లలను పాఠశాలల్లో చేర్పించే విధంగా ప్రచారాలు కూడా చేసుకున్నారు. అందులో భాగంగా రోజూ పదుల సంఖ్యలో పాఠశాలలకు చెందిన స్కూల్ బస్సులు విద్యార్థులను తీసుకువెళ్లేందుకు గ్రామాలకు వస్తున్నాయి.

అదే విధంగా ప్రస్తుతం రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం పంట పెట్టుబడికి రైతులకు ఇబ్బందులు తప్పడంలేదు. దీంతో పెట్టుబడి సాయం కోసం ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించక తప్పడంలేదు. ఇటువ్యవసాయ పనులు, కాలేజీలు, పాఠశాలల ఫీజుల భారంతో సగటు మనిషి ఆర్థిక ఇబ్బందులు వర్ణనాతీతం. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత రైతులకు వ్యవసాయానికి పెట్టుబడిసాయం అందక అవస్థలు పడుతున్నారు.

ఫీజుల భారం

ప్రస్తుతం ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీల్లో ఫీజులు విద్యార్థుల తల్లిదండ్రులకు ఆందోళన కలిగిస్తున్నాయి. ఫీజులతో పాటుగా పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం, బ్యాగుల కొనుగోలుకు నెలవారి బడ్జెట్ సరిపోవడంలేదు. ఫీజులు, బస్సురవాణా, పుస్తకాల భారం తడిసి మోపెడవుతోంది. ప్రాథమిక స్థాయికి రూ 40 వేలు, ఉన్నత పాఠశాలకు రూ.70 వేలు ఫీజు చెల్లించాల్సి వస్తోంది. కాలేజీలైతే వాటి స్థాయిని బట్టి లక్ష నుంచి రూ. 3 లక్షల వరకు ఖర్చు అవుతోంది. విద్యాఖర్చులు సామాన్య, మధ్య తరగతి కుటుంబాలకు భారంగా ఉన్నాయి. పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని అప్పు చేసేనైనా చదివించేందుకు తల్లిదండ్రులు నానా అగచాట్లు పడుతున్నారు. ఫీజుల వసూళ్లపై ప్రభుత్వం పర్యవేక్షణ కొరవడడంతో కాలేజీ యాజమాన్యాలు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యా సంస్థల ఫీజులను క్రమబద్ధీకరించడం, ఫీజుల వసూళ్లపై నిఘా వేయడం, ఐటీ దాడులు చేస్తే కొంత మేరకైనా ఫీజుల భారం తగ్గే అవకాశం ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

రైతులకు సాగు భారం కానుందా?

రైతులకు పంటల సాగు భారం కానుంది. కారణాలు అనేకం. గిట్టుబాటు ధరలు లేకపోవడం, వర్షాలు లేకపోవడం, ప్రభుత్వాలు రైతులను గురించి పట్టించుకోకపోవడంతో వారికి సాగు భారం కానుంది. ఏ పంట సాగుచేయాలన్నా లక్షల్లో ఖర్చు అవుతుంటే రైతు భరించే పరిస్థితిలో లేడు. రైతులు ఇతరపంటలు చేయలేక అప్పులు చేసైనా పంటలు సాగుచేసేందుకు సిద్ధమవుతున్నారు. ఖరీఫ్‌లో పంటలు బాగా వస్తాయని ఆశ రైతుల్లో పెరుగుతోంది. అయితే అటు ప్రభుత్వం ఇస్తామన్న అన్నదాత సుఖీభవ పథకం ఇప్పటివరకు అమలు చేయలేదు. సరిపడా విత్తనాలు అండం లేదు. దీంతో రైతులకు పంటలు సాగు చేయడం కష్టతరంగా మారుతోంది.


దగా చేసిన ప్రభుత్వం



కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైంది. పంట సాగుకు అవసరమైన డబ్బులు చేతిలో లేక పోవడంతో రైతులు అప్పులు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు పెట్టుబడి సాయం అందించక పోవడంతో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు కొనుగోలు చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి.

- పాలాక్షిరెడ్డి, రైతు సంఘ నాయకుడు

మధ్య తరగతికి కష్టమే



జూన్ నెల వచ్చిందంటే మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భారం తప్పదు. ఇప్పటికే పాఠశాలలు ప్రారంభమైయ్యాయి. ఈ తరుణంలో పిల్లలకు పుస్తకాలు, యూనిఫాం కొనుగోలు చేయక తప్పదు. జూన్ నెలలో ఖర్చులు అధికంగా ఉంటాయి. ప్రభుత్వం ఫీజులు నియంత్రిచకుంటే సామాన్య ప్రజలు కార్పొరేట్ విద్యాసంస్థల్లో చదవలేక, ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేక మధ్య తరగతి విద్యార్థులకు విద్య కష్టంగా మారే ప్రమాదం ఉంది.

- సురేంద్రన్, సీపీఐ నాయకుడు



అపూర్వ సమ్మేళనం

యాదమరి: మూడు దశాబ్దాల క్రితం చదువుకున్న పాఠశాలలో ఆదివారం అపూర్వ సమ్మేళనం నిర్వహించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991–92 సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థుల్లో 140 మంది కలుసుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ సరదాగా సంతోషంగా గడిపారు. ఆనాటి ఉపాధ్యాయులు బాబా సాహెబ్, చెన్న కేశవులు, గోవింద పిళ్లై, జయరాం రెడ్డి, పద్మావతి, భాస్కర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. అనంతరం పూర్వ విద్యార్థులందరూ కలిసి, తాము చదువుకున్న పాఠశాలపై మక్కువతో దాదాపు రూ.20 వేల విలువ చేసే నీటి శుద్ధి యంత్ర రక్షణకు అవసరమయ్యే గ్రిల్ నిర్మాణానికి పాఠశాల నిర్వాహకులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.